ప్రయత్నిస్తే. ఊహూ....వీలులేదు. బాధ్యతారహితంగా పిల్లలని పాడుచేసే తండ్రుల కంటె బాధలు పెట్టే భర్తని భరించడం నయమేమో? కన్నతల్లిగా, వారి క్షేమం కోరే తల్లిగా వారికోసమన్నా భర్తని భరిస్తుంది ఈ దేశం స్త్రీ! అందుకే భర్తలు ఎంత బాధపెట్టినా పిల్లలకోసం సహిస్తూ పడివుండే భార్యలున్న యీ దేశంలో పిల్లలకింకేంవున్నా లేకపోయినా తల్లిదండ్రుల యిద్దరి ప్రేమ లభిస్తుంది పుష్కలంగా. బాధ్యత తీసుకోకుండా పిల్లలని పాడుచేసే అవకాశం యిచ్చేకంటే తండ్రులకి బాధ్యత అప్పగించితేనే నయం! తనకి భర్త అవసరం లేకపోయినా బిడ్డలకి తండ్రి అవసరం వుంది! బిడ్డల ఆ హక్కుని తను పంతంతో, కోపంతో పోగొడితే రేపు పిల్లలే తనకి ఎదురు తిరిగితే యింక యీ పంతానానికి అర్థం ఏముంది! ఇన్నాళ్ళు "యీ ఆడవాళ్ళంతా భర్తలెంత హింసించినా ఎందుకు పడుంటారో" అని వారిమీద జాలి పడేది! యిప్పుడు....యిప్పుడు తనని చూసి తనే జాలి పడాలేమో!

మర్నాడు వచ్చే భర్త ముందు తల ఒగ్గడానికి సిద్ధపడింది జయంతి....పిల్లల కోసం! యీ దేశంలో ఆడది అంతకంటె ఏం చెయ్యలేని నిస్సహాయురాలు! "మాతృత్వం స్త్రీకి వరమన్న" వాళ్ళని షూట్ చెయ్యాలి" అనుకుంది కసిగా జయంతి– ఆ వరమిచ్చిన వేల్పుని ఏం చెయ్యాలి!

["ఆదివారం తండ్రులు" అనే వ్యాసం చదివాక]

★

# పురోగమనానికి పునాదిరాళ్ళు

"స్సారీ సునీతా. ఐయామ్ వెరీసారీ. ఐయామ్ హెల్ప్‌లెస్....కమిటీ మెంబర్లంతా తేల్చాక నేను ప్రతిసారి కలుగజేసుకోడం బాగుండదుగదా...." ప్రిన్సిపాల్ జయలక్ష్మి తేల్చి చెప్పేసింది. సునీత నిట్టూర్చి కుర్చీలోంచి లేచి నిలబడింది. నిజమే, ఎవరు ఎన్నాళ్ళు సహాయం చేస్తారు. ఆరేళ్ళ బట్టి ఎలాగో ట్రాన్స్‌ఫర్ లేకుండా ప్రతిసారి ఎవరినో పట్టుకుని బతిమిలాడి ఆపుచేయించుకుంటోంది.

"సునీతా ప్రతీవాళ్ళకీ ఏవో యిబ్బందులుంటాయి ఉద్యోగం అన్నాక. వున్న వూర్లోనే వుండాలంటే ఎలా కుదురుతుంది. యిల్లు, మొగుడు, పిల్లలు, చదువులు యీ బాదర బందీలు మనందరికీ వున్నవే."

ఆవిడ ఉపన్యాసం వినే ఓపికలేదు సునీతకి. "థాంక్స్ మేడమ్. మీరేం చేస్తారులెండి. ఇదివరకు మీచేతులో వున్నది చేశారు" శుష్కహాసం చేసి కదిలింది సునీత. "రేపు ఫేర్ వెల్ పార్టీ అరేంజ్ చేసినట్లున్నారు. వుయ్ విల్ మీట్ దేర్." సునీత వాడిన మొహం చూసి ఓదారుస్తున్నట్లంది.

నీర్సంగా, దిగులుగా స్టాఫ్ రూమ్‌లోకి అడుగు పెట్టిన సునీతని చూసి "ఏం అంటుంది ప్రిన్సిపాల్—ఆత్రుతగా అడిగింది ఎకనామిక్స్ లెక్చరర్ మాధవి.

"ప్చ్. లాభంలేదండి....ఆవిడ మాత్రం ఏం చేస్తుంది." భూభారం మోస్తున్నంత బరువుగా కుర్చీలో కూలబడింది సునీత.

"అయితే ఏం చేస్తావు....మీ ఆయనిక్కడ, నీవక్కడ, మీ ఆయనేం అంటారు. రిజైనిస్తే వూరుకుంటారా...." తోటి లెక్చరర్లందరిలోకి మాధవి క్లోజ్‌గా వుంటుంది సునీతతో. "ఏమో నాకంత అయోమయంగా వుంది మాధవీ. ఆలోచిస్తే మతిపోతోంది. చూస్తూ చూస్తూ వెయ్యిరూపాయలుద్యోగం మానలేను. నేనో చోట....ఆయనో చోట, రెండు కాపురాలు" దిగులుగా అంది.

"మీకేమిటండీ సునీతగారూ....యింజనీరు మొగుడుండగా హాయిగా యింట్లో తిని కూర్చోక యీ పాట్లెందుకండి" పొలిటికల్ సైన్స్ లెక్చరర్ ఉమ అంది. "నాలాంటి వాళ్ళంటే రోజుగడవక చేస్తాం....నేనే మీ పొజీషన్‌లో వుంటే హాయిగా యింట్లో పుస్తకాలు చదువుకుంటూ, పాటలు వింటూ ఎంజాయ్ చేసేదాన్ని." అంది నవ్వుతూ.

సునీత ఓ నవ్వు నవ్వింది. హాయిగా తింటూ చదువుకుంటూ ఆ సుఖమూ చూసింది. ఉద్యోగంలో బాధలూ చవిచూసింది. తను ఉద్యోగం ఎందుకు చేయాలనుకుంటుందో ఎవరికి తెలుసు. ఎలా చెపితే అర్థం అవుతుంది. ఇంజనీరు మొగుడు అని అందరికీ తెలుసు. కానీ యింట్లో పరిస్థితి ఎవరికి చెప్పుకుంటుంది. తనకిలేదా యింటిపట్టున వుండి యిల్లు, పిల్లలని చూసుకుంటూ వుండాలని. ఉదయం లేచింది మొదలు పరుగులు, రోజంతా నిలబడి పాఠం చెప్పడం, మళ్ళీ యింటికి వెళ్ళి చాకిరీ....పిల్లలు, రోగాలు, ఏడ్పులు యీ బాధ లన్నీ పడుతూ కూడా ఉద్యోగం ఎందుకు చేస్తుందో నని ఎవరూ ఎందుకు ఆలోచించరు. పెళ్ళికాని న్నాళ్ళు ఉద్యోగం చేసినా పెళ్ళవగానే తనూ హాయిగా యింటిపట్టున వుండి యిల్లు పిల్లలని చూసుకుంటూ వుండాలని ఆనంద పడింది. కానీ పెళ్ళయాక....

సునీత ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేశాక ఉద్యోగాల వేటలలో పడి ఒక ఏడాది ఖాళీగా వుంది. కనిపించిన పెళ్ళికొడుకులందరిని పెళ్ళిచూపులకి పిలిచాను. ఏడాది

దాటాక ఉద్యోగం వచ్చింది, కాని పెళ్ళి కొడుకు కుదరలేదు. పెళ్లి కుదరనందుకు
సునీతేం బాధపడలేదు- ఒక విధంగా. ఉద్యోగం చెయ్యాలన్న తన కోరిక యిలా
తీరబోతున్నందుకు ఆనందపడింది. యిన్నాళ్ళూ యింట్లో ఎప్పుడు ఏది అడిగినా
యిది లేదు అది లేదు అన్న జవాబుతోనే గడిచిపోయింది. నచ్చిన చీర కొనుక్కోవా
లన్నా ఓ సినిమాకివెళ్ళాలన్నా, ఓ పుస్తకం కొనాలన్నా ఓ చెప్పుల జత కొనుక్కో
వాలనిపించినా, ఓహాండ్ బ్యాగు ముచ్చటగా కొనాలన్నా అన్నింటికి అవాంతరాలే-
కోరికలు కోరికల్లాగే మిగిలిపోతుండా తన సంపాదనతో కొన్నాళ్ళన్నా ఎంజాయ్
చేయాలి. పెళ్ళయితే మళ్ళీ యిదే కథ అక్కడా అవుతుంది. యిల్లు, మొగుడు,
పిల్లల మధ్య తన కోరికలేం తీరుతాయి. తండ్రి మరీ గుమాస్తా కాకపోయినా ముగ్గు
రాడపిల్లలు ఇద్దరు మగపిల్లలతో, కరువురోజుల్లో తిండికి లోటు లేకుండా బతికారు
కాని కావాలనుకున్నది ఏవి దొరికాయి? ఓ షిఫాను చీర మనసు తీరిందా....మంచి
ఆర్గండి చీర, స్నేహితురాళ్ల చీరలు చూసి మనసుపడి అడిగిన కోరికలు ఏం తీర్చారు
ఇంట్లో. చదువులు చెప్పించారు. అంతే చాలన్నట్టు తృప్తిపడాలి మరి....ఐదు
గురు పిల్లలకి అంతకంటె ఓ మధ్యతరగతి తండ్రి ఏం చేస్తాడు. అందుకే పెళ్లవక
ముందు తనకోసం తను సంపాదించుకుని ఎంజాయ్ చెయ్యాలి. సునీత కోరిక అది.
"ఇరవై రెండేళ్లు వచ్చాయి. ఇన్నాళ్లు చదువన్నావు—యిప్పుడింక ఉద్యోగమా.
ఏదో అప్పోసప్పో చేసి నిన్ను దాటిస్తే యింక ఆఖరివాడు మేము ఏదో మాపాట్లు
మేం పడతాం" అని తల్లి నజిగినా సునీత లెక్క చేయలేదు. కూతురు పెళ్లికి
కట్నం అటుంచి పెళ్లి ఖర్చులకన్నా పదివేలు సమకూర్చలేని తండ్రి కొన్నాళ్ళు
ద్యోగం చేసి నాలుగు డబ్బులు వెనకేస్తే దాని పెళ్లి దాని డబ్బుతోనన్నా చేయచ్చు
ననుకున్న తండ్రి మౌనం వహించాడు సునీత ఉద్యోగం చెయ్యాలన్న ఆరాటంలో
ఎవరి ఉద్దేశాలు గ్రహించే ధోరణిలో లేదు. ఏడాది తరువాత కొత్తగా పెట్టిన
ఉమెన్స్ కాలేజిలో ఉద్యోగం సంపాదించుకుంది.

ఓ మూడు నెలలు నిజంగానే ఎంజాయ్ చేసింది. సునీత - మొదటి నెల జీతంలో షిఫాన్ చీర కొనుక్కుంది. ఎప్పటినించో చదవాలనుకున్న పుస్తకాలు కొంది. మంచి చెప్పుల జత, లెక్చరరు హోదాకి సరిపోయే హాండు బ్యాగు వగైరాలు, అరడజను జాకెట్లు కుట్టించుకుంది. తన మొదటి జీతంలో ఇంట్లో అందరికీ స్వీట్లుకొని తెచ్చింది. ఇంటిల్లిపాదిని వెంటపెట్టుకుని సినిమాకి తీసికెళ్ళి అట్నించి హోటలులో మంచి భోజనం పెట్టించింది. డబ్బు....డబ్బుకున్న విలువ సునీతకు ఆ నెలలోనే అర్థం అయింది.

ఓ ఏడాది రెండేళ్ళు ఉద్యోగం చేసి కొంత డబ్బు దాచుకుని యింటికి కావలసిన ఫర్నీచర్ సామాన్లు కొనుక్కోవాలి. తండ్రి ఎలాగు యియ్యలేదు. తన సంపాదనలో

నన్నా నాలుగూ అమర్చుకోవాలి. సుజాత ఆలోచన ఆచరణలో పెట్టడం రెండే ళ్ళయినా సాధ్యం మాత్రం కాలేదు. మొదటి రెండు మూడు నెలలు తన చీరల సరదా, యింట్లోవాళ్ళకి బట్టలు కొనడంతో అయిపోయింది. సరదాలు, మోజులు తీరాయనిపించే సరికి చేతిలో డబ్బులు ఏమయిపోతున్నాయో తేలీకుండానే అయి పోయేవి. "ఎందుకే అలా డబ్బు తగలేస్తావు—కాస్త వెనకేసుకుంటే పెళ్ళిఖర్చు కుంటుందే అనే తల్లే" ఒసే—బజారంట వస్తావు, వచ్చేటప్పుడు కాస్త కూరలు కొని తేవే"తో ఆరంభించి, రెండు మూడు నెలలు గడిచేసరికి నెలవారీ సామాన్లు సహితం కొనడం సునీత వంతయిపోయింది. "పాలవాడొచ్చి కూర్చున్నాడే మీ నాన్నగారికి డబ్బు జతకూడ లేదుటే. కాస్త యియ్య నాన్న తరువాత నీకిస్తారు." ఆ తరువాత యివ్వడం అనేది వుండదని కొద్దిరోజుల్లోనే తేలిపోయింది. తన బస్సుఛార్జీలు, మధ్యాహ్నం కాలేజీలో తాగే టీ ఖర్చు, నెలకో రెండు మూడు సినిమాలు, చిల్లర ఖర్చులు అంతా కలిపి నూరు రూపాయలు దాటదు. మిగతా ఆరొందలు ఎలా అయి పోతున్నాయో కూడా తెలియకుండా అయిపోయేవి. "అక్కా ప్లీజ్ సినిమాకెడతానే పదిరూపాయలీయవే"-అని అడిగే తమ్ముడిని కాదనలేదు. వీధిలోకి "ఆపిల్సు, అరటి పెళ్ళొచ్చాయి కొనవే" అని గడుసుగా అడిగే తల్లి మొదట్లో డైరక్టుగా అడగడానికి మొహమాట పడి తల్లి చేత అడిగించే తండ్రి అర్నెల్లు గడిచేసరికి కూతురి ముందు చేయి చాపడానికి తండ్రికేం సిగ్గనిపించలేదు. "అమ్మా సునీతా ఎలక్ట్రిసిటీ బిల్లు వచ్చిందమ్మా—ఆ పచారి దుకాణంలో డబ్బిచ్చేరా" అని ఇంటి బాధ్యత అంతా ఆమె మీదే నెమ్మదిగా పెట్టేసి తప్పించుకోడం మొదలుపెట్టాడు.

ఓ ఆరేడు నెలలు సునీతకేం బాధ అనిపించలేదు. ఓ ఆడపిల్ల అయీ తను తండ్రికి ఎలా అనరాగా నిల్చిందోనని గర్వపడింది. "ఎవరికి పెడుతున్నాను. నావాళ్ళేగా" అని తృప్తిపడింది ..."అన్నయ్యలు ఎప్పుడన్నా ఓనూరు రూపాయ లన్నా పంపలేదు. మన సునీత చూడు అవసరానికి ఎలా ఆదుకుంటోందో - ఈ రోజుల్లో ఆడపిల్లలే నయమే" అనే తండ్రిని చూసి, పాపం యిన్నాళ్ళకి ఆయనకి కాస్త ఊపిరి పీల్చుకున్నట్టుంది. ఎప్పుడూ ప్రతిదానికి వెతుక్కోవడమే యిన్నాళ్ళు" అని జాలిపడింది.

ఒక ఏడాది గడిచి, ఉద్యోగం మోజు తీరాక యింట్లో తల్లి తండ్రి కాబూలీ వాళ్ళలా కన్పించడం మొదలుపెట్టారు సునీతకి. యింట్లో ఆదుకుంటున్నాను అన్న గర్వం పోయి ఛీ....ఎంత సిగ్గు లేకుండా ఓ ఆడపిల్ల కష్టపడి డబ్బు తెస్తుంటే, పీడించి తీసుకుంటున్నారు అని తల్లి తండ్రి మీద విముఖత బయలుదేరింది. ఉద్యో గానికి ముందు పెళ్ళి పెళ్ళి అని గోల పెట్టిన తల్లి కూతురికి పెళ్ళి కావాలన్న సంగతే మర్చిపోయినట్టు ఆ ప్రసక్తి ఎత్తక పోవడం చూస్తుంటే ఉక్రోషం వచ్చేది

సునీతకి. అక్కలందరికి పురుళ్ళు పుణ్యాలు బాలసారలు, ఏదో తను అప్పున్నట్టు తన డబ్బుతో ఖర్చు పెడ్తుంటే .... పెళ్ళికాని కూతురుందన్న సంగతి మరిచి నా డబ్బుతో వాళ్ళకి పురుళ్ళు పోస్తారు. ఛీ...." అనుకుంది. నిష్కర్షగా "నా డబ్బు యీయను" అని చెప్పలేకపోయింది సునీత—పాతికేళ్ళు వస్తున్నా పెళ్ళికాకుండా వుండడం, తనతోటి వాళ్ళందరికి పెళ్ళిళ్ళయి పిల్లలు పుట్టడం....ఉద్యోగం చేసి నాలుగు సామాన్లు కొనుక్కోవాలన్న ముచ్చట తలకలగానే మిగిలిపోవడం.... యిదంతా సునీతని ఓ రకం విరక్తిలో పడేశాయి. నేరకపోయి ఉద్యోగంలో చేరాను లేకపోతే ఎలాగో అలా ఈపాటికి పెళ్ళిచేసేవారు. ఉద్యోగం చేసినందుకు తనకేం లాభం మిగిలింది. వీళ్ళందరికీ దోచి పెడ్తున్నాను. ఒక్కో నెల గడుస్తుంటే సునీతకి యిల్లంటే నరకం, తల్లి తండ్రి అంటే బద్ధ శత్రువుల్లా కనపడడం మొదలుపెట్టారు. కూతురు చిరాకులు పరాకులు, విసుర్లు, కసుర్లు, యీసడింపులు, ముభావం....ఏదీ తెలియనట్టే పట్టించుకోని తల్లి దండ్రులను చూసి ఏమిచెయ్యాలో, ఎలా చెప్పాలో తెలియక మరింత మూడీగా తయారయింది సునీత.

ఆ సమయంలో సునీత మొర దేవుడాలకించినట్టు కాలేజీలో కొలీగ్ పెళ్ళికి విజయవాడ వెళ్ళింది. ఆ పెళ్ళిలో ఫ్రెండు కజిన్ బ్రదర్ ప్రభాకర్ సునీత పట్ల ఆకర్షితుడయ్యాడు. సునీత వివరాలు ఆరాతీసాడు. సునీత స్నేహితురాలు యిద్దరి మధ్య మధ్యవర్తి అయి పెళ్ళిమాటలు జరిపింది. ప్రభాకర్ ఏదో కంపెనీలో యింజనీరుగా వున్నాడు. పదిహేను వందలు జీతం. స్మార్ట్‌గా వున్నాడు. సునీత చదువు ఉద్యోగం విని యింకా ఆకర్షితుడయ్యాడు ప్రభాకరం. యిద్దరూ మాట్లాడుకోడానికి వీలుగా ఏకాంతం కల్పించింది స్నేహితురాలు. తండ్రికి కట్నకానుకలు యిచ్చే శక్తి లేదంది సునీత. "పరవాలేదు. మీరే నా కట్నం" అన్నాడు ప్రభాకర్. సునీత తన కల యిన్నాళ్ళకి నిజం అయినందుకు ఆనందపడిపోయింది. ప్రభాకర్ ఆమె కంటికి దేవుడిలా కన్పించాడు. తండ్రిలేడు తల్లి వుందని, ఓ పెళ్ళైదొచ్చిన చెల్లెలుందని యిద్దరూ అన్నగారి దగ్గరుంటున్నారని తన కుటుంబం విషయమంతా చెప్పాడు. అన్నింటికీ ఆనందంగా తలాడించింది సునీత. ఆ క్షణంలో తనెంతో అదృష్టవంతురాలు. ఆలశ్యం అయినా ప్రభాకర్‌లాంటి వాడు దొరికాడు అని మురిసిపోయింది. "ముందు మీరు వెళ్ళి మీ వాళ్ళకి చెప్పండి. లాంఛనంగా మీ ఫాదర్‌ని మీ అన్నయ్యని, అమ్మని కలిసి చెప్పమనండి. వాళ్ళు నా ఇష్టానికే వదిలేశారు నా పెళ్ళి. నా వైపునుంచి నాకేం ప్రాబ్లమ్స్ లేవు" అన్నాడు ప్రభాకర్. తన వైపు నుంచి మాత్రం ఏముంటాయి. కట్నం లేకుండా ఇంజనీరు పెళ్ళికొడుకు వస్తుంటే యిష్టపడడానికి తనకేం వెర్రా తనవాళ్ళడ్డు పెట్టడానికి వాళ్ళకేం పిచ్చా అనుకుంది సునీత. అతనన్న మాటలకి తలాడించింది. ఆమెకి ఆ క్షణంలో ఏదో మైకంలో

మాదిరి అన్నీ జరుగుతున్నట్టు బాహ్యస్మృతి పోయినట్టు అనిపించింది. పెళ్ళినుంచి ఉరుకులు పరుగుల మీద వెళ్ళినట్టే యిల్లు చేరింది. తీరా చేరాక తన పెళ్ళికబురు తనే చెప్పుకోవాలంటే ఏదోలా అనిపించింది. నసుగుతూ అంతా వివరించింది తల్లికి సునీత. ఆవిడ ఆశ్చర్యంతో తెల్లపోతూ "అతను యింజనీరా కట్నం లేకుండా చేసుకుంటానన్నాడా అతనే అడిగించాడా చెల్లెలి చేత విన్ను" నమ్మశక్యం కానట్టు అడిగిందావిడ. "ఇంజనీరంటున్నావు కట్నం వద్దంటున్నాడంటావు. యిందులో ఏం మోసం లేదుగదా" తండ్రి భోజనం చేసి సావకాశంగా వక్కపొడి నవులుతూ మొహం అప్రసన్నంగా పెట్టాడు. సునీతకి ఛర్రున కోపం వచ్చింది. యిన్నాళ్ళకి తనంతట తను పెళ్ళికొడుకుని కుదుర్చుకునివస్తే యిలా మాట్లాడుతారేమిటి మొహాల్లో ఎక్కడా సంతోషం లేకపోగా వెధవ అనుమానాలు - ఛా.... యిలాంటి తల్లితండ్రు లుంటారా ఎవరికన్నా. "అమ్మా అతను నాకు నచ్చాడు. అతనికి నేను నచ్చాను - యిద్దరం పెళ్ళిచేసుకోదలిచాం. యీ విషయంలో యింకా వాదనలు అనవసరం. మీరు పెద్దవాళ్ళుగా నిలబడి పెళ్ళి జరిపిస్తేసరే, లేదంటే మేమే రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుంటాం. నిష్కర్షగా చెప్పింది సునీత. బిడియపడి సిగ్గుపడి చేతులారా ప్రభాకర్‌లాంటివాడిని వదులుకుంటే తనకింక జన్మలో పెళ్ళికాదు. తన బతుకు బాట ఎవరూ వేసేందుకు సిద్ధంగా లేనప్పుడు తనే వేసుకోవాలి. తల్లి తండ్రి మొహమొహాలు చూసుకున్నారు. ఇద్దరి మొహాలు ముడుచుకున్నాయి.

"సరే కట్నం లేకుండా చేసుకుంటానన్నాడు బాగానే వుంది. అయినా పెళ్ళికీ దానికీ కనీసం ఓ పది పదిహేను వేలన్నాకావద్దూ" తండ్రి నసుగుతూ సాగదీశాడు.

"అది కూడా అతన్నే పెట్టుకోమందామా నాన్నా" వ్యంగ్యంగా అంది సునీత తిరస్కారంగా చూస్తూ. "కూతురికి ఓ పదివేలు ఖర్చుపెట్టే స్తోమత మాకు లేదని తేల్చారుగా నా పాట్లేవో నేను పడి పెళ్ళిచేసుకుంటాను మీరేం బాధపడకండి" విసురుగా అని లేచి వెళ్ళిపోయింది సునీత. ఎంత స్వార్థం. సంపాదించే కూతురు పెళ్ళి అయితే మరి డబ్బు వుండదని యింతలాకన్న తల్లితండ్రులే ప్రవర్తిస్తారా....

"ఎక్కడో నాలుగైదు వేలన్నా పట్రండి లేకపోతే అది ఏమన్నా అనుకుంటుంది. పెళ్ళి ఖర్చు దాన్ని పెట్టుకోమని ఎలా అంటాం. ఏదో మీరే తంటాలు పడండి. లేకపోతే ఒక ఫిక్సెడ్ డిపాజిట్ తీయండి" తల్లి నెమ్మదిగా అంటోంది.

"ఆ తీస్తా....అది కాస్త ఖర్చుపెట్టి సునీత కాస్తా వెళ్ళిపోతే యిల్లెలా గడుస్తుందే" కోపంగా అన్నాడు తండ్రి.

"బాగుందండీ, అయితే కూతురు పెళ్ళి చేయడం ఊరికి ఉపకారం ఏమిటి.... అయినా ఏదో అది నాలుగు రాళ్ళు వెనకేసుకుంటుంది అనుకున్నాంగాని యిలా హఠాత్తుగా పెళ్ళి కుదురుతుందనుకున్నామా...."

వింటున్న సునీత మనసు వుడికిపోయింది. ఛీ యీ డబ్బు ఎంత పాపిష్టిది కన్నతల్లి తండ్రులు కూడా యింత స్వార్థంగా ఆలోచింపచేసే యీ వెధవడబ్బు. అసలు తను ఉద్యోగంలో చేరడం మొదటి పొరపాటు. పెళ్ళవగానే రిజైన్ యిచ్చి పారేసి హాయిగా యింటిపట్టున వుంటుంది. ప్రభాకర్‌లాంటి మొగుడుండగా యింకా యీ ఉద్యోగం ఎందుకు" సునీత నిశ్చయించేసుకుంది.

* * *

సునీత ఆలోచనలు, అంచనాలు అన్నీ మొదటిరాత్రే తారుమారు అయిపోయాయి. మొదటి రాత్రి మధురక్షణాల మధ్య సునీత ముంగురులు సవరిస్తూ "నువ్వు హైద్రాబాదు ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నిస్తున్నావా? ఎలాగైనా ప్రిన్సిపాల్‌ని బతిమిలాడి ట్రాన్స్‌ఫర్ అయ్యేట్టు చూడు. నీవొకచోట నేనొక చోట అయితే కష్టం" అన్నాడు. సునీత అతని గుండెల్లో మొహం దాచుకుని "ట్రాన్స్‌ఫర్ ఎందుకు, వెధవ ఉద్యోగం రిజైన్ చేస్తాను. నాకింకేం ఉద్యోగం చెయ్యాలని లేదు హాయిగా యింటి పట్టున వుండి మీ డ్యూటి చేస్తాను." అంది మురిపెంగా ముద్దులు గుడుస్తూ. ప్రభాకర్ చకితుడైనట్టు చూశాడు. అప్రయత్నంగా అతని చెయ్యి సునీతని వదిలేసింది. "ఏమిటి ఉద్యోగం రిజైన్ చేస్తావా, మతిపోయిందేమిటి. ఓ ఎనిమిది వందలొచ్చే ఉద్యోగం వదులుకుంటావా, అలాంటి తెలివి తక్కువ పనులు చేయకు. కావాలంటే ట్రాన్స్‌ఫర్ అయేంతవరకూ ఓ నెలో రెండునెలలో సెలవు పెట్టు." ఆరాటంగా సలహా ఇచ్చాడు.

"అబ్బ వద్దండీ. నాకింక ఉద్యోగం చెయ్యాలని లేదు. ఉద్యోగం అంటే బోరుకొట్టేసింది. మీరుండగా నాకీ పాట్లెందుకు. పదహారు వందలతో ఇద్దరం హాయిగా వుండొచ్చు...." ప్రభాకర్ మొహం ముడుచుకుంది. "పదహారు వందలు... హైదరాబాదులో పదహారు వందలు నథింగ్ నీవేదో ఉద్యోగం చేస్తావని ఓ ఎనిమిది వందలు వస్తాయని సంతోషిస్తుంటే ఉద్యోగం మానేస్తానంటావేమిటి.... నీవేదో ఉద్యోగం చేస్తున్నదానివని ఆశపడి!"—ప్రభాకర్ ఆగిపోయాడు సునీత మొహంలో రంగులు మారడం చూసి.

"అంటే నా ఉద్యోగం చూసి ఆశపడి చేసుకున్నారా....అంటే కేవలం నా ఉద్యోగం కోసం నన్ను చేసుకున్నారన్నమాట...." దెబ్బతిన్నట్టంది సునీత.

"సునీతా, బి ప్రాక్టికల్. ఈ కరువురోజుల్లో ఒకరి సంపాదనతో బతకడం ఎంతో కష్టం. ఏదో తిండి కంటే గడిచి పోతుంది. యింట్లో ఏవస్తువు అమర్చుకోవాలన్నా ఎన్నేళ్లు పడుతుందో తెలుసా? అలాటప్పుడు భార్య ఉద్యోగం చెయ్యాలనుకోడం తప్పా....నీ ఉద్యోగం చూసేగా పాతికవేలు కట్నం ఇస్తామని వచ్చినా వదులుకుని...." సునీత మొహం మాడిపోవడం చూసి, నోరు జారానని నాలిక కొరుక్కున్నాడు ప్రభాకర్.

"గుడ్, వెరీగుడ్ ఐడియా. నెలకి వెయ్యి రూపాయల చొప్పున యింకో పాతికేళ్ళకి ఎంతవుతుందో లెక్క కట్టుకుంటే ఆఫ్టరాల్ వెధవ పాతిక వేలు ఎంత అని కట్నం లేకుండా చేసుకుని నన్నుద్ధరించారన్నమాట." సునీత ఎంత ప్రయత్నించినా ఆమె గొంతులో వ్యంగం, హేళన దాగలేదు. ప్రభాకర్ మొహం ముడుచుకున్నాడు.

మొదటి రాత్రి కావాలని కోరి పెళ్ళి చేసుకున్న భార్యాభర్తల మధ్య మాటలు యివా? ప్రభాకర్ని ఎంత ఉన్నతంగా ఊహించుకుంది. ఓ ఆదర్శ పురుషుడని మురిసిపోయింది. డబ్బు....డబ్బు....అటు తల్లి తండ్రులకి యిటు మొగుడికి అందరికీ కావల్సింది డబ్బే! ఆడదంటే యిదివరకు వంటింటి మిషను, పిల్లల్నికనే మిషనుగానూ భావించేవారు. యిప్పుడు వాటికి తోడు డబ్బు సంపాదించే యంత్రంగా మారిందన్నమాట! ఉద్యోగం చేసే ఆడదంటే మిషనులాగా యిటు యింట్లో చాకిరి అటు బయట చాకిరి మధ్య నలిగి యంత్రంగానే మారింది. సంపాదిస్తున్న తనకోసం తను ఏం ఎంజాయ్ చేస్తోంది. పెళ్ళి కాకముందు తల్లితండ్రులు, పెళ్ళయ్యాక మొగుడు యింకా ఆ తరువాత పిల్లలు. ప్రభాకర్ మొదటి రోజే యిలా మాట్లాడడం ఆమెకి ఎదురుచూడని దెబ్బ! ఆమె కలల సౌధం పునాదులతో సహా కదిలిపోయినట్లయింది. ప్రభాకర్ పోనీ తరువాత అనివుంటే– "సునీ నిన్ను వదిలి వుండలేను యిక్కడికి ట్రాన్స్ఫర్ చేయించుకో అంటే పోనిద్దూ వెధవ ఉద్యోగం ఓ రెండు మూడు నెలలన్నా మనం ఎంజాయ్ చెయ్యాలి లీవు వడేయి" అంటే ఎంత బాగుండేది.

"సునీతా నేను ఫ్రాంక్గా మాట్లాడాను కాని నిజం అంత. మన మధ్య తరగతి సంసారాల్లో యిద్దరూ జాబ్ చేస్తేగాని రోజులు గడిచే స్థితి లేదు." ప్రభాకర్ సానునయంగా ఏదో చెప్పబోయాడు.

"ప్లీజ్ స్టాపిట్ నాకర్థం అయింది. ఉద్యోగం మానను సరేనా మీకు కావల్సింది అదేగా. ఉద్యోగం చేస్తాను సరేనా" అంది. యింకా ప్రభాకర్ నోట ఏం వినడం యిష్టం లేక అప్పటికి అప్రసంగం ఆ పేసింది సునీత.

* * *

తరువాత ఆరు నెలల్లో ప్రభాకర్ గురించిన ఆమె అంచనాలన్నీ మరింత తల్లకిందులయిపోయాయి.

ఒక నెల ఎరన్డ్ లీవు పెట్టి ప్రభాకర్‌తో కల్సి హైదరాబాదు కాపురానికి వెళ్ళింది సునీత. అక్కడున్న నెల రోజులలో కొత్త భార్యతో సినిమాలు, షికార్లు తిరగాలన్న మోజుకంటె సునీత ఉద్యోగం కోసం ఆరాటం ఎక్కువయింది. హైదరాబాదులో రెండు మూడు కాలేజీలకి అప్లికేషన్లు పెట్టించాడు. ఇంకో కాలేజీలో ఎవరో తెల్సిన ఫ్రెండుంటే అతనితో సునీతని తీసికెళ్ళి ప్రిన్సిపాల్‌కి చెప్పించాడు. నెల శలవు అయిపోయే వేళకి శలవు పొడిగించు అంటాడేమోనని ఆశించింది సునీత. సునీత శలవు యింకో నాలుగు రోజులుండగానే వెళ్లి సునీతకి టిక్కట్టు కొని తెచ్చేశాడు. సునీతకి యింకేం అనాలనిపించలేదు. రైలెక్కింది.

ట్రాన్స్‌ఫర్ కోసం అప్లికేషన్ ఫలించలేదు. "టరమ్ మధ్యలో ఎలా సమ్మర్ వెకేషన్‌లో చూద్దాం" అంది ప్రిన్సిపాల్. అంటే ఆరునెలలు.

ప్రభాకర్ శని ఆదివారాల్లో వచ్చేవాడు భార్య అవసరంకోసం. "ఎందుకండీ ఈపాట్లు మీరక్కడ నేనిక్కడ. రిజైన్ యిచ్చి వచ్చేస్తాను. అంతగా కావాలనుకుంటే అక్కడే ఏదో చూసుకోవచ్చు" అంది. పెళ్ళయినా యింకా తల్లి తండ్రి దగ్గరే వుండాలంటే బిడియంగా వుంది సునీతకి. అంతే కాక పెళ్ళయిందగ్గరనించి సునీత జీతం వచ్చేవేళకల్లా ప్రభాకర్ ఏదో ఖర్చు రెడీచేసి వుంచేవాడు.

"సునీతా మా ఫ్రెండు మంచి సోఫా సెట్టు అమ్మేస్తూంటే ఆరువందలకి కొన్నాను. యీ నెల గ్రైండర్ కొనాలి. సునీతా ముందు రెండు మంచాలు పరుపులన్నా వద్దా నీకోసమేగా యిదంతా నీవు సుఖంగా వుండాలనేగా నా తాపత్రయం" అంటూ ఇది కొంటా అది కొంటున్నా అని సునీత జీతం మొహమాటం అన్నా లేకుండా అడిగి తీసుకునేవాడు. పెళ్ళయిందగ్గిరనించి యింట్లో డబ్బు యీయడం మానేసిందని తల్లి దండ్రులు మొహాలు ముడుచుకున్నారు. మూడు నాలుగు నెలలు గడిచిందగ్గరనించి ఏదో వంకతో నణగడం, సాధించడం ఆరంభించారు. తన తిండి ఖర్చన్నా యివ్వకుండా అలా వుండాలంటే సునీతకి ఎంతో బిడియంగా వుంది. ఆ యింట పుట్టి పెరిగినా పెళ్ళి కాగానే తనను పరాయిదాన్నిచేసి వూరికే యింట్లో పడి తింటున్నట్టు తల్లి తండ్రి దెప్పుడు మాటలు, వాళ్ళ చూపులు భరించలేక సునీత ప్రాణం విసిగింది. దానికి తోడు సునీత నెల తప్పింది. మూడో నెల ఒకటే నీరసం. వాంతులు ఆ సమ్మరైనా కూడా ట్రాన్స్‌ఫర్ అయే సూచనలు కనపడకపోగానే విరక్తిగా ప్రభాకర్ ఏం అన్నా సరే యింక యిక్కడుండను అనుకుని రిజైన్ యిచ్చేసి హైదరాబాదు రైలెక్కేసింది.

ఉద్యోగం మానేసివచ్చిన సునీతని చూసిన ప్రభాకర్ మొహంలో మార్పు చూస్తుంటే తిరస్కారం, విరక్తితో సునీత మనసు విరిగింది. "నీకెంత ధైర్యం, ఉద్యోగాలు దొరక్క జనం ఏడుస్తుంటే ఎనిమిదొందల ఉద్యోగం వదిలి వచ్చేస్తావా నాతోటి చెప్పనన్నా చెప్పకుండా మానేస్తావా? "ప్రభాకర్ ఎగిరిపడ్డాడు. అసలే నీర్సంగా వున్న సునీతకి చిర్రెత్తుకు వచ్చింది. "ఏమిటి మీ ఉద్దేశం. మీకు పెళ్ళాం కంటె నా ఉద్యోగమే ముఖ్యంలావుంది. నేనుద్యోగం చెయ్యకపోతే నాకు తిండి పెట్టరా. పెళ్ళానికి తిండి పెట్టడం కూడా కష్టంగావుంటే యీ పెళ్ళి ఎందుకు చేసుకున్నారు. నేనేం మేడలు, కారులు కావాలని మిమ్మల్ని వేధించానా అంత గతి లేకుండా నా ఉద్యోగం మీదే బతుకుతున్నట్టు ఎందుకలా మాట్లాడుతారు. మీకు ఉద్యోగం డబ్బు తప్ప నీకసలు ఓ భార్యుందని, దానికో మనసుందన్న ఆలోచనే రాదా" సునీత కంఠం రుద్ధమయి కన్నీళ్ల బొటబొట జారాయి. ప్రభాకర్ మొహం ఎర్రపరుచుకుని అక్కడనించి వెళ్ళిపోయాడు.

తరువాత ఒక ఏడాది సునీతపాట్లు దేముడి కెరుక. ఒక రెండు మూడు నెలలు ఇన్‌డైరెక్ట్‌గా విసుర్లు, విసిరేవాడు. తరువాత దెప్పుళ్ల, నణుగుళ్ల, విసుర్లు, కసుర్లు, తిట్లు. మొదట్లో ఏదన్నామాట వచ్చేసరికల్లా "మాకొలీగ్ పెళ్ళాం చక్కా బ్యాంకిలో ఉద్యోగం, ఉద్యోగంలో చేరి ఐదేళ్ళయిందో లేదో అప్పుడే ఫ్లాట్ కొన్నారు. స్కూటరు కొనుక్కోవాలనుకున్నాను నీవు నాలుగేళ్ళబట్టి ఉద్యోగం చేస్తున్నావు నీ దగ్గిర డబ్బుంటుందిగదా అని కొనాలనుకున్నాను. అసలు ఆ డబ్బంతా ఏమయినట్లు. ఆ సినిమాకి వెళ్లాలంటే యిద్దరికి ముప్పై రూపాయలవుతుంది. ఎక్కడి కెడతాం యీ జీతంతో యీ కరువు రోజుల్లో. అవును నీకు కట్టెల్లు కావాలి బొంబే డైయింగ్ దుప్పట్లు కావాలి. డన్‌లప్‌లు కావాల్సినదానివి ఉద్యోగం మానకపోవాల్సింది. "మా ఫ్రెండున్నాడు వాడి భార్య కాలేజీలో లెక్చరరు, వీడి డబ్బుతో యిల్లు గడిపి ఆవిడ జీతంతో నెలకో వస్తువు చొప్పున కొంటున్నారు. కొందరి అదృష్టం అది. మా చెల్లెలు పెళ్లి కుదిరిందిట నన్ను మూడు వేలు సర్దమన్నారు. ఎక్కడనించి తెచ్చియిస్తాను. పోనీ యిద్దరి జీతం వుంటే ఏ అప్పో తెచ్చియిచ్చేవాడిని. లేదంటే నమ్ముతారా మీ ఆవిడ ఉద్యోగం చేసిన డబ్బేంలేదూ అంటారు." ఇలా సమయం వచ్చినప్పుడల్లా పరోక్షంగా విసుర్లు విసిరేవాడు. సునీత విననట్టు మాట్లాడేదికాదు. ఏదన్నా జవాబిస్తే వాదన పెరిగి చిలికి చిలికి గాలివాన అయ్యేది.

ఇంకో రెండు నెలలు గడచేసరికి పాలకి, కూరకి, పప్పుల దగ్గరనించి కూడా యింటి ఖర్చుకి డబ్బడిగితే "నీవడిగినప్పుడల్లా డబ్బియ్యడానికి నేనేం వేలు సంపా

దింపడం లేద"నేవాడు. "లీటరు పాలు చాలకపోతే కాఫీ మానేద్దాం యింక కొనే శక్తి నాకు లేదు," డబ్బు అడగనంత సేపు మామూలుగా వుండేవాడు. ఏ ఖర్చు కన్నా డబ్బడిగేసరికి ముఖకవళికలు మారిపోయేవి. పెద్ద వాదన, రాద్ధాంతం చేస్తే అడిగిన దానిలోసగం యిచ్చేవాడు. ప్రభాకర్ ధోరణి చూస్తే ఖర్చుకి పదిరూపాయలు అడగాలన్నా ప్రాణసంకటంగా తయారైంది సునీతకి. ఇంటి ఖర్చుకి డబ్బీయకుండా కాల్చుకుతింటే తనెక్కడినించి తెచ్చి సంసారం నడపాలి. నాలుగైదు సంవత్స రాలుగా ఉద్యోగం చేస్తూ చేతిలో డబ్బాడుతూ వుండే సునీతకి ఐదు పదికి కూడా ప్రతిసారి అతని ముందు చెయ్యి చాపడం చిన్నతనంగా వుండేది. ప్రభాకర్ ధోరణి చూసాక ప్రాణం విసిగెత్తి "ఛా యింతకంటె ఆ ఉద్యోగమే నయం ఆ డబ్బు తెచ్చి యీయన మొఖాన కొడితే అయినా శాంతి వుంటుందేమో కొంపలో" ననిపిం చింది సునీతకి. కాని అప్పటికి ఎనిమిదో నెల—ఈ పురుడు అది అయ్యాక ఏదో ఉద్యోగం చూసుకోవాలి అనుకుంది.

సునీత బాబుపుట్టాక కనిపించిన అప్లికేషన్స్ పడేసింది. పిల్లాడు పుట్టాక మరింత ఖర్చులుపెరిగి ప్రభాకర్ పిసినారితనం మరింత పెరిగింది. పాలడబ్బా కొనా లన్నా...."ఆవుపాలు అలవాటు చెయ్యి ముందు నించి అలవాటయితే అవే పడ తాయి— డబ్బాలు కొనలేను. ఆ, ప్రామ్ కావాలి బాబుకి, ఆ, నాకూ స్కూటర్ కావాలి. సరదాలు నీకేకాదు. నాకూ వున్నాయి. అంత సరదాలుంటే ఉద్యోగం చేసి నీ పిల్లాడికి డ్రస్సులే కొంటావో బొమ్మలే కొంటావో కొని సరదాలు తీర్చుకో! నా సరదాలు నీవు ఏం తీర్చావని నీ సరదాలు నే తీర్చాలి. బాబుమీద నాకూ వుంది ప్రేమ. ప్రేమలకీ డబ్బుకావాలి" పిల్లాడికి పాలడబ్బా కొనడం పూరికి, తనకి వుప కారంలా మాట్లాడే ప్రభాకర్‌ని సునీత క్షమించలేక పోయింది. ఆ రోజు ఇద్దరి మధ్య పెద్ద దెబ్బలాట అయింది. ఆ కోపంలో ప్రభాకర్ రెచ్చిపోయి "అద్దే మాటాడకు, పాతిక వేలొచ్చేకట్నం వదులుకుని నిన్ను పెళ్ళాడానంటే నీ అందం చూసనుకుంటున్నావా, నీవేం రంభవా ఊర్వశివా ఛా ఆ పాతిక వేలు కట్నం తీసు కుని బ్యాంకులో ఫిక్సడ్‌డిపాజిట్ తీసుకుంటే నెలకో రెండు వందలన్నా వచ్చేవి అత్యాశకి పోయి నిన్ను చేసుకున్నాను" అనేశాడు. ప్రభాకర్ మాటలతో యింతలా హింసించగలడని, యీ మాటలతో అతని సంస్కారం ఎంతో అర్థం అయిన సునీత యింకేం మాట్లాడలేదు.

బాబు పుట్టిన ఐదు నెలలకి తీవ్ర ప్రయత్నాలు చేసి ఆఖరికి ఉమెన్స్ కాలే జీలో ఉద్యోగం సంపాదించుకుంది. అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకొచ్చి అతని ముందు పడేసింది. అది చూడగానే అతని కళ్ళల్లో వెలుగు, మొహంలో ఆనందం చూడగానే మనిషి డబ్బుకెంత బానిస అవుతాడో అర్థం అయింది సునీతకి. "అమ్మ

దొంగా నాకు చెప్పకుండా అప్లై చేసి తెచ్చుకున్నావా....సునీతా అమ్మని వెంటనే యిక్కడికి వచ్చేయమని టెలిగ్రాం యిస్తాను. బాబుకేం పరవాలేదు ఇంట్లో అమ్మ చూసుకుంటుంది. నీ వెళ్ళి ఎల్లుండి జాయిన్ అయిపో" మొదటి రాత్రి కూడా లేని సౌమ్యత అభిమానం ఆ గొంతులో చూసి ప్రభాకర్ పట్ల గౌరవం మరికాస్త తగ్గింది.

నెలజీతం తీసుకొచ్చి బస్సుచార్జీలు, టీ ఖర్చుమినహా అతని చేతికిచ్చేది. ఆ డబ్బు తనుంచుకుంటే జరిగే రాద్ధాంతం తెలుసు. అతనితో వాదన పెట్టుకుని లాభం లేదని అర్థమయ్యాక యింట్లో సుఖశాంతులుండాలంటే తను నోరుమూసుకుని వుండడం మినహా మరో గత్యంతరం లేదని సునీతకి అర్థం అయింది. బాబు వెంట పాప ఏడాది గిర్రున తిరిగే సరికి పుట్టేసింది, ఇద్దరు చంటిపిల్లలతో, అత్తగారికి ఏదో పిల్లలని తను లేనప్పుడు చూడడం మినహా వంట అది చేసే ఓపిక లేదుగనుక యింట్లో చాకిరి చేసి పిల్లల అవసరాలు చూసి కాలేజీకి పరిగెత్తి మళ్ళీ వచ్చిచాకరి. గానుగెద్దు జీవితం ఆరేళ్ళ పట్టీ అలవాటు పడింది. యిప్పుడీ ట్రాన్స్‌ఫర్....యిప్పు దేమి చెయ్యాలి. ఉద్యోగం మానతానంటే ప్రభాకర్ వూరుకుంటాడా. పిల్లల్ని పెట్టుకుని తను యింకో కాపురం పెట్టాలా. అప్పుడు రెండు కాపురాలతో డబ్బేం వుంటుంది. పిల్లలని యిక్కడ స్కూల్లో జాయిన్ చేసింది. ఆ వూళ్ళో మంచి స్కూల్సులేవు. పిల్లల చదువు ఏమతుంది. పిల్లల్ని యిక్కడ వదలి తను అక్కడ....అమ్మో. అది లాభంలేదు. ఆలోచనతో బుర్ర వేడెక్కింది.

* * *

"ఆలోచిస్తుంటే మతి పోతోంది మాధవీ. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. ఛా....ఛా.. ఆడదాని బ్రతుకు రోజు రోజుకీ అధ్వాన్నమవుతుందనిపిస్తుంది. ఇదివరకటి ఆడవాళ్ళకి ప్రాబ్లమ్స్ లేవు. హాయిగా తెచ్చి పడేసింది వండి పిల్లల్ని కంటూ ఏ బాధలూ అవమానాలు సమస్యలు లేకుండా అమాయకంగా బతికేవారు. ఆనాడు కేవలం స్త్రీ వంటింటి కుందేలు. పిల్లల్ని కనే యంత్రం, కాని మనం ఏం సాధించాం. వాటితో పాటు డబ్బు కూడా సంపాదించే యంత్రంగా మారాము. ఆడది ఉద్యోగం చేయడం ఆత్మ స్థైర్యానికి అని అనుకోడం మనల్ని మనం వంచించు కోడానికే. ఆడదాని ఉద్యోగం అవసరాలు తీర్చుకోడానికి. అదీ మగవాడి అవస రాలు. తను ఆడదాని బాధ్యత పంచుకోక పోయినా బాధ్యత సగం మోపడానికి ప్రయత్నిస్తున్నాడు ఈనాటి పురుషుడు" ఉక్రోషంగా, కసిగా అంది సునీత.

"అవును సునీతా, మనం ట్రాన్సిట్ పీరియడ్‌లో వున్నాం. ఇటు పాతకాలం ఆడదానిలా వుండిలేక. విదేశీ వనితల మాదిరి పూర్తి స్వేచ్ఛా స్వతంత్రాలు లేక

మధ్యదారిలో దారితెలియక కొట్టు మిట్టు ఆడుతున్నాం. ఇదంతా స్త్రీ పురోగమనా నాంది అనుకుంటే మనం ఆ పురోగమనానికి పునాది రాళ్ళం. ఈ పునాదులు ఎండకి వానకి తడిసి రాటకి పోటకి అగితే ఆ పునాది మీద భవంతి లేస్తుంది. ఈనాడు మనం వేసిన పునాదిపై భవంతిలో తరువాతి తరం స్త్రీలు హాయిగా ఆనందంగా స్వేచ్ఛావాయువులు పీలుస్తారని ఆనందిద్దాం. అంతకంటే మనం ఏం చెయ్యగలం" మాధవి అంది.

సునీత విస్ఫారిత నేత్రాలతో మాధవి వంక అభినందిస్తున్నట్టు చూసింది. "కరక్ట్ ఎంత బాగా చెప్పింది మాధవి. ఒక మంచిపనికి అనేక త్యాగాలవసరం మన జాతి విముక్తికి గాంధి ఎంత త్యాగం చెయ్యాల్సి వచ్చింది. స్త్రీ జాతి విముక్తికి, పురోగమనానికి మనం పునాదిరాళ్ళం అయినా పరవాలేదు. తరువాత తరం స్త్రీ కోరు కున్న ఆత్మస్థైర్యం, స్వశక్తి వగైరాలు లభ్యమయితే...."అనుకుంది సునీత నిట్టూరుస్తూ.

[వనిత మాస పత్రిక]

★

# తిరిగిరాని గతం

ఆటో దిగి శ్రీవల్లి లోపలికి అడుగుపెట్టింది. అప్పుడే ఇంట్లోంచి ఏదో శవం వెళ్ళినట్లు ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అంతా తలో మూల వాడిన మొహాలతో కూర్చుని వున్నారు. మహిమ తండ్రి పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నారు. పెద్ద న్నయ్య శ్రీధర్ ఓ పుస్తకం, చిన్నన్నయ్య శ్రీకర్ ఓ పుస్తకం పట్టుకుని కూర్చు న్నారు - మహిమ ఎక్కడుందో కనపడలేదు– "అంకుల్.... ఏమయింది? ఎందుకు అంత అర్జంటుగా రమ్మన్నారు...." వల్లి అందర్నీ చూస్తూ ఆరాటంగా అడిగింది. వల్లి గొంతు వినగానే మహిమ తల్లి జానకి, పెద్దవదిన శశిరేఖ, చిన్నవదిన లత లోపల్నించి వచ్చారు.... అంతా ఒక్కసారి "అదికాదు వల్లీ...." అంటూ ఏదో చెప్పబోయారు. "ష్....వుండండి, కూర్చో వల్లీ...." అంటూ రాజారావుగారు అందరినీ వారించి "ఏం లేదమ్మా.... నీకు తెల్సు గదా ఇవాళ మహిమని చూడటా నికి సాయంత్రం మీ పినమామగారి అబ్బాయి వస్తున్నాడు గదా, అతన్ని తీరా పెళ్ళి